క్లుప్తంగా

25న సర్వసభ్య సమావేశం

కాకుమాను: ఈ నెల 25న స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శరత్ బాబు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మధ్యాహ్నం 3 గంటలకు నిర్వహించే సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

భగవాన్ వేంకటేశ్వరస్వామి ఆశ్రమ వార్షికోత్సవం

తెనాలి టౌన్: సంగంజాగర్లమూడిలోని భగవాన్ వేంకటేశ్వర స్వామి ఆశ్రమంలో బుధవారం 19వ వార్షిక మహోత్సవాన్ని నిర్వహించారు. గంగాధరస్వామి ఆధ్వర్యంలో ఉదయం సుప్రభాత సేవ, అభిషేకం, పూజలు చేశారు. వేడుకల్లో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని పూజలు జరిపారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో ధర్మకర్తలు జంపాల గోపాలరావు, దివ్యజ్యోతి, అనిరుధ్, సమన్వయకర్తలు కొత్తపల్లి వెంకయ్యబాబు, సువర్ణ శివకుమారి, సభ్యులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి అబుల్ కలాం ఆజాద్ కృషి



కాకుమాను: దేశంలో విద్యాభివృద్ధికి మౌలానా అబుల్ కలాం ఆజాద్ చేసిన కృషి ఎనలేనిదని ఎంఈఓ కేఫ్ కెనడీ అన్నారు. స్థానిక ఉర్దూ పాఠశాలలో బుధవారం మౌలానా అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కెనడీ మాట్లాడుతూ తొట్టతొలి భారత ప్రభుత్వంలో తొలి విద్యాశాఖ మంత్రిగా ఆజాద్ విద్యాభివృద్ధికి కృషి చేశారన్నారు. ప్రతి విద్యార్థి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని విద్యలో రాణించాలని ఆయన సూచించారు. ఈసందర్భంగా ఆజాద్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. హెచ్ఎం రిహాన, విద్యార్థులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో భస్మ బుధవారం ప్రార్థనలు



కాకుమాను: మండలంలోని గ్రామాలలో క్రైస్తవులు భస్మ బుధవారం నుంచి మండల కాల ఉపవాస ప్రార్థనలు చేపట్టారు. స్థానిక ఆంధ్ర ఇవాంజికల్ లూథరన్ చర్చిలో పాస్టర్ కృపాదానం ఏసు క్రీస్తు మరణం గురించి వాక్యోపదేశం చేశారు. ఏప్రిల్ 7వ తేదీ గుడ్ ఫ్రైడే వరకు ఉపవాస ప్రార్థనలు చేయనున్నట్లు ఆయన తెలిపారు. ప్రతి రోజు రాత్రి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నట్లు పాస్టర్ కృపాదానం తెలిపారు.

26న కవి సమ్మేళనం

పాత గుంటూరు: నవ్యాంధ్ర రచయితల సంఘం ఆధ్వర్యంలో బ్రాడీపేటలోని ఎస్‌హెచ్ఓ హాలులో ఈ నెల 26న కవి సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు తూములూరి రాజేంద్రప్రసాద్, సయ్యద్ జానీ బాషా బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో కవులు పాల్గొనాలని ఆయన కోరారు.

నేడు పీసీ సర్కార్ జయంతి సభ

పాత గుంటూరు: ప్రముఖ మెజీషియన్ పీసీ సర్కార్ జయంతి సందర్భంగా ప్రపంచ మ్యాజిక్ డే నిర్వహిస్తున్నట్లు వి.వి.రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. నాజ్ సెంటర్‌లోని ఇనిస్టిట్యూట్ ఆఫ్ మ్యాజిక్ ఇనిస్టిట్యూట్‌లో పీసీ సర్కార్ జయంతి సభ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమంలో జిల్లాలోని మెజీషియన్లు పాల్గొనాలని ఆయన కోరారు.

లా కాలేజీ జూనియర్ అసిస్టెంట్ విధుల నుంచి తొలగింపు

నెహ్రూనగర్: విద్యార్థినుల్ని లైంగికంగా వేధించినట్లు అందిన ఫిర్యాదులపై విచారణ చేసి నిజమని తేలడంతో జేసీ లా కళాశాల ఉద్యోగిని విధుల నుంచి యాజమాన్యం తొలగించిందని జిల్లా మహిళా, శిశు సంక్షేమ శాఖ అధికారి బి.మనోరంజని తెలిపారు. కాలేజీలో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న జి.అరవింద్ కుమార్‌పై వచ్చిన లైంగిక ఆరోపణలపై దిశ లాయర్ విజయలక్ష్మి ఆధ్వర్యంలో కళాశాలలోని ఇంటర్నల్ ఫిర్యాదు కమిటీ ద్వారా సమగ్ర విచారణ జరిపించామని పేర్కొన్నారు. ఆరుగురు విద్యార్థినులు రాతపూర్వకంగా ఇచ్చిన అంశాల్ని కళాశాల యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లి సదరు ఉద్యోగిని విధుల నుంచి తొలగించినట్లు తెలిపారు.

మనోహరం.. పుష్పశయనోత్సవం

- పుష్పశయ్యగా భ్రమరాంబ అమ్మవారు
- ముగిసిన మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలు



ద్వాదశ ప్రదక్షిణలకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వాహనం

పెదకాకాని: భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో భక్తిశ్రద్ధలతో పుష్పశయనోత్సవం నిర్వహించారు. పెదకాకాని శివాలయంలో మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవ వేడుకల్లో భాగంగా బుధవారం భ్రమరాంబ అమ్మవారిని పుష్పశయ్యగా అలంకరించారు. పూజా కార్యక్రమాల్లో భాగంగా సుప్రభాతసేవ, హారతులతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. అర్చకులు, వేదపండితులు మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహా నివేదన, పంచహారతులు, ద్వాదశ ప్రదక్షిణములు, పుష్పశయనోత్సవం, ఫలప్రదానం, పవళింపు సేవ శాస్త్రోక్తముగా నిర్వహించారు. మహా శివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాల వేడుకలు ముగిసినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు.

చిరస్మరణీయుడు కన్నెగంటి హనుమంతు



నెహ్రూనగర్: బ్రిటిష్ ముష్కరుల తూటాలకు నేలకొరిగిన పల్నాటి బెబ్బులి, అమరవీరుడు కన్నెగంటి హనుమంతు చిరస్మరణీయులని ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి, మిర్చి యార్డు చైర్మన్ చంద్రగిరి ఏసురత్నం, పశ్చిమ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్ పేర్కొన్నారు. ఆయన 101వ వర్ధంతిని పురస్కరించుకొని చుట్టుగుంటలోని విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో గుంటూరు జిల్లాకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. జిల్లా నుంచి ఎంతో మంది పోరాడి ప్రాణాల్ని సైతం త్యజించి, స్వాతంత్ర్యాన్ని సాధించారని తెలిపారు. వారి త్యాగాల్ని భావి తరాలు మరిచిపోకుండా గుర్తు చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు కాంట్రకుంట గురవయ్య, అచ్చాల వెంకట రెడ్డి, అందుగుల సంతోష్, షేక్ రోషన్ తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి



పాంద్రపాడు ఆరోగ్య కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

పాంద్రపాడు(కాకుమాను): ప్రజా వైద్యశాలకు వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్స్ నోడల్ అధికారి డాక్టర్ రవికుమార్ అన్నారు. మండలంలోని పాంద్రపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం రాత్రి ఢిల్లీ నుంచి వచ్చిన ఇండియన్ పబ్లిక్ హెల్త్ స్టాండర్స్ సభ్యులు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నోడల్ అధికారి రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వైద్య శాలల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి వైద్యశాలల్లో మౌలిక వసతులు, యంత్ర పరికరాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. వైద్యశాలకు వచ్చే రోగులకు సిబ్బంది మెరుగైన సేవలు అందించాలని ఆదేశించారు. ఢిల్లీ టీం సభ్యుడు డాక్టర్ రంజిత్ కన్నా మాట్లాడుతూ ప్రతిరోజు వైద్యులు అందుబాటులో ఉంటూ ప్రజలకు కావాల్సిన అన్ని రకాల మందులు ఉండే విధంగా చూడడంతో పాటు అన్ని రకాల పరీక్షలు నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను, వైద్యశాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ శ్రీధర్, యశ్వంత్,సిబ్బంది పాల్గొన్నారు.

పోరాట యోధుడు ఉయ్యాలవాడ



ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఏపీ రెడ్డి సంఘం నాయకులు



ఉయ్యాలవాడ నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు

గుంటూరు రూరల్: బ్రిటిష్ వారిని ఎదిరించి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన మొదటి యోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామారావు తెలిపారు. బుధవారం నగర శివారుల్లోని లాంఫాం వ్యవసాయ పరిశోధన స్థానంలోని విశ్వవిద్యాలయం పరిపాలన భవనంలో ఏర్పాటు చేసిన ఉయ్యాలవాడ వర్ధంతి కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉయ్యాల వాడ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం రిజిస్ట్రార్ మాట్లాడుతూ సిపాయిల తిరుగుబాటుకు ముందే బ్రిటిష్ వారిని ఎదిరించిన ఉద్యమకారుడు, స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడని అని తెలిపారు. వ్యవసాయ పీఠాధిపతి డాక్టర్ ప్రతాప్‌కుమార్ రెడ్డి, వ్యవసాయ విస్తరణ సంచాలకులు డాక్టర్ పి.రాంబాబు, వ్యవసాయ ఇంజినీరింగ్ పీఠాధిపతి డాక్టర్ ఎ.మణి, సామాజిక విజ్ఞాన పీఠాధిపతి డాక్టర్ సీహెచ్ చిరంజీవి, పరీక్షల నియంత్రణ అధికారి డాక్టర్ పి.సుధాకర్, డైరెక్టర్ ఆఫ్ సీడ్స్ డాక్టర్ సుబ్బరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో...

గుంటూరు రూరల్: బ్రిటిష్ వారిని ఎదిరించి భారత దేశానికి స్వాతంత్ర్యం కోసం పోరాటం చేసిన ప్రథమ స్వాతంత్ర్య సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి అని ఆంధ్రప్రదేశ్ రెడ్డి సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని హౌసింగ్‌బోర్డ్ కాలనీనందున్న సంఘం రాష్ట్ర కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఉయ్యాలవాడ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రెడ్డిసంఘం ప్రధాన కార్యదర్శి తమ్మినేని గోపాల్‌రెడ్డి అధ్యక్షత జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ బ్రిటిష్ వారిని ఎదిరించి స్వాతంత్ర్యం కోసం తన ప్రాణాలను వదిలిన మహోన్నతుడు ఉయ్యాలవాడని కొనియాడారు. సంఘం రాష్ట్ర గౌరవ సలహాదారుడు అన్నపురెడ్డి విజయభాస్కరెడ్డి, ఉపాధ్యక్షుడు ఇంటూరి సాంబశివారెడ్డి, యువజన విభాగం వర్కింగ్ ప్రెసిడెంట్ అట్ల విశ్వనాథరెడ్డి, మహిళా కార్యదర్శి, జిల్లా మహిళా అధ్యక్షురాలు భీమవరపు విజయలక్ష్మి, శ్యామల వెంకటేశ్వరరెడ్డి, శివారెడ్డి, సీతామహాలక్ష్మి, రమాదేవి, శ్రీలక్ష్మివెంకటకృష్ణారెడ్డి తదితరులు పాల్గొని నివాళులు అర్పించారు.

అడ్డగోలుగా పది పరీక్ష ఫీజు వసూళ్లు

హైస్కూళ్లలో జెడ్పీటీసీ ఆకస్మిక తనిఖీల్లో వెలుగులోకి..



విద్యార్థులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ జిలానీ

ప్రత్తిపాడు: మండలంలోని పలు జెడ్పీ హైస్కూళ్లలో పదవ తరగతి పరీక్ష ఫీజులు అధికంగా వసూళ్లు చేసిన విషయం జెడ్పీటీసీ తనిఖీల్లో బయటపడింది. మంగళవారం ప్రత్తిపాడులో జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ప్రజాప్రతినిధులు జెడ్పీ స్కూళ్లలో పదవ తరగతి విద్యార్థుల నుంచి అధికంగా ఫీజులు వసూళ్లు చేస్తున్నారంటూ ఫిర్యాదులు వచ్చాయి. దీంతో బుధవారం జెడ్పీటీసీ విప్పాల కృష్ణారెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు ప్రెసిడెంట్ షేక్ జిలానీలు మండల పరిధిలోని కోయవారిపాలెం, తిక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ఆకస్మిక తనికీలు చేశారు. పదవ తరగతి విద్యార్థులతో మాట్లాడారు. పరీక్ష ఫీజు ఎంత కట్టారని ప్రశ్నించారు. పరీక్ష ఫీజు రూ.125 ఉండగా, కొందరు రూ.350, మరికొందరు రూ.450 ఇచ్చినట్లు చెప్పారు. ఫీజుకు సంబంధించిన ఎలాంటి రిసిప్ట్‌లు ఇవ్వలేదని జెడ్పీటీసీకి వివరించారు. ఈవిధంగా పది విద్యార్థులు అందరూ చెప్పడంతో.. విద్యార్థులు చెప్పిన విషయాలను రికార్డు చేసి జిల్లా విద్యాశాఖాధికారికి పంపుతామని కృష్ణారెడ్డి చెప్పారు. పాఠశాల హెచ్ఎం విధుల్లో లేకపోవడంతో ఇదేమని ఉపాధ్యాయులను ప్రశ్నించడంతో మాకేమీ తెలియదని, వసూలు చేసింది హెచ్ఎం అని జెడ్పీటీసీకి వివరించారు. ఇదిలా ఉంటే తిక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్‌లో తరగతి గదుల్లో సిమెంట్ కట్టలు ఉండటం, తొమ్మిదో తరగతి విద్యార్థులు వరండాల్లో కూర్చుని ఉండటం గమనించిన జెడ్పీటీసీ హెచ్ఎం తీరుపై అసహనం వ్యక్తం చేశారు. కనీసం బ్లాక్ బోర్డు లేకుండా పాఠాలు ఎలా చెబుతారని, మీ పిల్లలు అయితే ఇలానే కూర్చోబెడతారా అంటూ ఘాటుగా ప్రశ్నించారు.

కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన అవసరం



గుంటూరు రూరల్: విద్యార్థులు విద్యతోపాటుగా కంప్యూటర్ పరిజ్ఞానాన్ని కలిగి ఉంటే మంచి ఫలితాలను సాధించవచ్చని చలపతి ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖరరావు తెలిపారు. బుధవారం చలపతి ఇంజినీరింగ్ కళాశాల, యలమంచిలి ఫౌండేషన్, టెక్‌వింగ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జొన్నలగడ్డ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు కంప్యూటర్ పరిజ్ఞానంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థులు కంప్యూటర్, సాంకేతిక పరిజ్ఞానాన్ని అవసరమైన మేరకు మాత్రమే వినియోగించుకోవాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో కంప్యూటర్ పరిజ్ఞానం ఎంతో అవసరమని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, విద్యార్థులు తదితరులున్నారు.

గులాబీరంగు పురుగుల నివారణపై అవగాహన

గుంటూరు రూరల్: పంట భూముల్లో పంటలు లేని సమయాల్లో పత్తి పంటలో గులాబీ రంగు పురుగుల నివారణ చర్యలు చేపట్టాలని లాంఫాం కీటక విభాగం శాస్త్రవేత్త డాక్టర్ డయానా తెలిపారు. బుధవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామంలో గులాబీ రంగు పురుగుల నివారణపై రైతు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. క్షేత్రస్థాయిలో దుక్కిలో గులాబీ రంగు పురుగుల నివారణ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పత్తి పంటను 160 రోజుల నుంచి పొడిగించవద్దని తెలిపారు. పత్తితీతలు పూర్తయిన వెంటనే పత్తి చెట్లను ష్రెడ్డర్ సహాయంతో చిన్న చిన్న ముక్కలుగా చేసి రోటోవేటర్ సహాయంతో భూమిలో కలిసే విధంగా దున్నుకోవాలని తెలిపారు. ఈవిధంగా చేస్తే పత్తి చెట్లపై ఉండే గుడ్లు, లార్వాలను నాశనం చేయవచ్చని చెప్పారు. వెంటనే పొలంలో జీలుగ విత్తుకుని పశువులకు మేతగా వినియోగించుకోవచ్చని తెలిపారు. శాస్త్రవేత్తలు డాక్టర్ శారద, రైతులు వంగా నవీన్‌రెడ్డి, నామా శ్రీనివాస్, నర్సిరెడ్డి, తదితరులున్నారు.

వ్యక్తిగత పరిశుభ్రతతో వ్యాధులు దూరం



గుంటూరు రూరల్: కాలానుగుణంగా వచ్చే వ్యాధులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని వైద్యుడు రావెల నీరెన్ తెలిపారు. బుధవారం పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ నరేన్ మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, పరిశుభ్రమైన ఆహారాన్ని తీసుకోవాలని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ వి.అనూరాధ, ఎన్ఎస్ఎస్ విభాగం ఆఫీసర్ అంకప్పనాయుడు తదితరులున్నారు.

మళ్లీ అధికారమే లక్ష్యంగా పనిచేయాలి

సచివాలయ కన్వీనర్లు, గృహ సారథుల సమావేశంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుచరిత, పక్కన బొప్పన భవకుమార్

పెదనందిపాడు: గృహ సారథులు రోజుకు 10 ఇళ్లకు వెళ్లి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరించి 2024లో పార్టీ అధికారంలోకి రావడమే లక్ష్యంగా పని చేయాలని ప్రత్తిపాడు శాసనసభ్యురాలు మేకతోటి సుచరిత అన్నారు. బుధవారం నాగులపాడు వ్యవసాయ మార్కెట్ యార్డు ఆవరణలో జరిగిన సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు, గృహ సారథుల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సుచరిత మాట్లాడుతూ గృహ సారథులు, వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి వెన్నెముక లాంటివారని, సమన్వయంతో పనిచేసి పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ పరిశీలకుడు బొప్పన భవకుమార్, ఎంపీపీ టి.హెప్సిబా, వైస్ ఎంపీపీలు షేక్ ఖాశింబీ, కమ్మ సాంబశివరావు, ప్రత్తిపాడు మార్కెట్ యార్డు డైరెక్టర్లు షేక్ ఖాశింపీరా, కొండా కృష్ణారెడ్డి, పార్టీ సాంస్కృతిక విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాంబశివరావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో ప్రతి చిన్నారికి ఆరోగ్యం



విద్యార్థులకు పౌష్టికాహారం అందజేస్తున్న జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు

గుంటూరు రూరల్: ప్రతి చిన్నారి ఆరోగ్యంగా, దృఢంగా ఎదగాలని మన రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంక్షేమ పథకాలను విద్యార్థులకోసం అందజేస్తున్నారని గుంటూరు రూరల్ మండలం జెడ్పీటీసీ తుమ్మల సుబ్బారావు తెలిపారు. బుధవారం మండలంలోని జొన్నలగడ్డ గ్రామం జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు జగనన్న అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. పాఠశాలల అభివృద్ధికి నాడు–నేడు, విద్యార్థుల ఆరోగ్యం కోసం జగనన్న గోరుముద్ద, నేడు పదవతరగతి విద్యార్థుల కోసం పౌష్టికాహారం పంపిణీ వంటి ఎన్నో కార్యక్రమాలు చేపట్టటం జరిగిందన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి భవిష్యత్తును పొందాలన్నారు. కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. సర్పంచి మబ్బు శిరీష, ఉప సర్పంచి వంగా నవీన్‌రెడ్డి, సుధాకర్, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

ప్రజలకు మెరుగైన తాగునీరు సరఫరాకు చర్యలు

కమిషనర్ కీర్తి చేకూరి



ఇంటర్ కనెక్షన్ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ కీర్తి చేకూరి

నెహ్రూనగర్: నగర ప్రజలకు మెరుగైన తాగునీరు అందించేందుకు, రానున్న వేసవిలోపే పైపులైన్ల లీకులకు మరమ్మతుల్ని పూర్తి చేసేలా ఇంజినీరింగ్ అధికారులు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేశారని నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. సంజీవయ్య నగర్ రైల్వే క్రాసింగ్ గేటు, అరండల్‌పేట హెచ్ఎల్ఆర్ వద్ద జరుగుతున్న ఇంటర్ కనెక్షన్ పనుల్ని బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెహ్రూనగర్ రిజర్వాయర్ నుంచి హెచ్ఎల్ఆర్ ప్రస్తుతం ఉన్న 800 డయా పైప్‌లైన్ స్థానంలో ఏర్పాటు చేసిన 900 పైప్‌లైన్ అనుసంధాన పనులు యుద్ధప్రాతిపదికన జరగాలని ఇంజినీరింగ్ అధికారులకు చెప్పారు. పనుల్ని ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ, ఆ ప్రాంతంలోనే అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనుసంధాన, లీకుల మరమ్మతుల పనులు నాణ్యతగా ఉండాలని, నిర్లక్ష్యంగా ఉంటే కాంట్రాక్టర్‌తో పాటు పర్యవేక్షణ అధికారులపైనా చర్యలు తప్పవని స్పష్టం చేశారు. లీకుల వల్ల పలు ప్రాంతాల్లో తాగునీరు వృథా అవ్వడం వల్ల శివారు ప్రాంతాలకు సమగ్రంగా ఇవ్వలేకపోతున్నామని చెప్పారు. లీకుల్ని ప్రస్తుత షట్ డౌన్ సమయంలోనే పూర్తి చేసేలా ఏఈలు చర్యలు తీసుకోవాలని ఆమె ఆదేశించారు. రానున్న వేసవిలో నగరంలో ఎక్కడా తాగునీటి సమస్య తలెత్తకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారుల్ని ఆదేశించారు. కార్యక్రమంలో ఎస్ఈ భాస్కర్, ఈఈలు శాంతిరాజు, సుందరరామిరెడ్డి, డీఈఈలు శ్రీనివాసరెడ్డి, మహ్మద్ రఫిక్, ఏఈలు సేతుబాబు, సునీల్ కుమార్, సచివాలయ ఎమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

కార్మికులకు అండగా ఉంటాం

నగరపాలక సంస్థలో పనిచేసే కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని, వారికి పరిహారాల్ని వెంటనే అందించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటామని నగర నగర కమిషనర్ కీర్తి చేకూరి తెలిపారు. ఇటీవల మరణించిన ప్రజారోగ్య విభాగ కార్మికురాలు కర్రా మరియమ్మ కుమార్తెకు రూ.2 లక్షల ఎక్స్ గ్రేషియా చెక్‌ని బుధవారం నగరపాలక సంస్థ కాన్ఫరెన్స్ హాలులో ఆమె అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నగరపాలక సంస్థ నుంచి పరిహారాలు, పీఎఫ్ కూడా త్వరగా అందేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత విభాగ సూపరింటెండెంట్లను ఆదేశించారు.

25న కంటి వైద్య శిబిరం

పెదనందిపాడు: ఈ నెల 25తేదీన పెదనందిపాడు రోటరీక్లబ్, శంకర కంటి ఆసుపత్రి మరియు జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు రోటరీక్లబ్ అధ్యక్షుడు కె.విక్టర్ జాన్‌పాల్ వైద్యశిబిర వివరాలను బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం ప్రత్తిపాడులోని ఎస్ఆర్ఎస్ రెయిన్‌బో స్కూల్‌లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ఈ వైద్యశిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం

గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే మేకతోటి సుచరిత



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

గుంటూరు రూరల్: పేదరికాన్ని నిర్మూలించి, ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పేర్కొన్నారు. బుధవారం 26వ డివిజన్ అంకిరెడ్డిపాలెంలో డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి ఆధ్వర్యంలో జరిగిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. శివారు కాలనీలు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసుతుల కల్పనకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు చేపట్టిందన్నారు. ప్రజలను కలిసి వారి సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారాలు చూపారు. మన ఇంటి వద్దకే ప్రభుత్వాన్ని పంపి సంక్షేమ పథకాలు అందజేస్తున్న జగనన్నకు మనమంతా అండగా ఉండాలని కోరారు. జెడ్పీటీసీలు తుమ్మల సుబ్బారావు, ఎస్ఎం గుల్జార్‌బేగం, గ్రామ మాజీ సర్పంచి శ్యామల బ్రహ్మారెడ్డి, ఆర్అండ్‌బీ కార్పొరేషన్ డైరెక్టర్ పిల్లి మేరి, సొసైటీ చైర్మన్‌లు తంగెళ్ల నాగేశ్వరరావు, కాశీవిశ్వనాథం, వైఎస్సార్ సీపీ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు మెట్టు వెంకటప్పారెడ్డి, దుంపాల రాధ, కందుకూరి జ్యోతి, పుట్టా బాజీ, గోపి, నాయక్, వెంకటరామయ్య, వెంకట్, ప్రజాప్రతినిధులు, సచివాలయం సిబ్బంది తదితరులున్నారు.

వైభవంగా ఆలయ జీర్ణోద్ధరణ ప్రతిష్ట



మహోత్సవంలో పాల్గొన్న చిన జీయరుస్వామి

పాత గుంటూరు: శ్రీ లక్ష్మీనారాయణపురంలోని శ్రీ లక్ష్మీనారాయణస్వామి ఆయన జీర్ణోద్ధరణ ప్రతిష్టా మహోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో త్రిదండి శ్రీ చిన జీయరుస్వామి, శ్రీ త్రిదండి అహోబల రామానుజజీయరుస్వామి, శ్రీ త్రిదండి రామచంద్ర రామానుజజీయరు స్వామి, శ్రీమాన్ ధనకుదరం సీతారామానుజాచార్యస్వామి పాల్గొన్నారు. ఉత్సవంలో భాగంగా అంకురారోపణం, అరణి మథనం, అగ్ని ప్రతిష్టాపనం, చతుఃస్థానార్చనం, పంచగవ్యాధివాసం, ఘృతాభిషేకం, ఛాయాధివాసం, జలాధివాసం తదితర పూజల్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో విశేష సంఖ్యలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. మహోత్సవాన్ని ఆహ్వాన సంఘం సభ్యులు పర్యవేక్షించారు.

26న ప్యూర్ బ్రీడ్ డాగ్ కాంపిటీషన్

పాత గుంటూరు: గుంటూరు కెనల్ క్లబ్ ఆధ్వర్యంలో వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో ఈ నెల 26న ఉదయం 9 గంటల నుంచి వివిధ జాతుల ప్యూర్ బ్రీడ్ డాగ్ కాంపిటీషన్ నిర్వహిస్తున్నట్లు ఆ క్లబ్ అధ్యక్షుడు పి. రామచంద్రరాజు తెలిపారు. నగరంపాలెంలోని రెడ్‌క్రాస్ భవనంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆ రోజు ఉదయం కాంపిటీషన్, సాయంత్రం 6 గంటలకు డాగ్ ఫ్యాషన్ షో జరుగుతుందని, అనేక రకాల జాతుల కుక్కలను చూడవచ్చని తెలిపారు.

డ్రెయినేజీ సమస్యలకు శాశ్వత పరిష్కారం

నెహ్రూనగర్: తూర్పు నియోజకవర్గం పరిధిలోని 10వ డివిజన్‌పొన్నూరు రోడ్డు జున్ను షాహీద్ నగర్‌లో డ్రెయినేజీ సమస్యల్ని శాశ్వతంగా పరిష్కరిస్తామని కార్పొరేటర్లు షేక్ మీరావలి, అబీద్ బాషా తెలిపారు. డివిజన్‌లో జరుగుతున్న డ్రైనేజీ పైపులైన్ పనుల్ని బుధవారం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ మహిళా నాయకురాలు నూరిఫాతిమాతో కలసి పరిశీలించారు. మరమ్మతుల కారణంగా నివాసాలు కోల్పోయిన వారికి ఇంటి స్థలాలు కేటాయించే విధంగా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకు వెళతామని చెప్పారు.